క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న యువకులు

కవిటి : తనపై నమ్మకం ఉంచి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. మంగళవారం కవిటి మండలం వడ్డిజల్లుపుట్టుగలో ఎమ్మెల్యేకు పౌర సన్మానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బెందాళం రమేష్, మణిచంద్ర ప్రకాష్, పొందల కృష్ణారావు, బార్ల చిన్నబాబు, బాసుదేవ ప్రధాన్, బెందాళం తిరుమల, రమణ, పండి దేవంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో రక్షణ



అవగాహన కల్పిస్తున్న జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల

టెక్కలి: తలకు హెల్మెట్ భారం కాదని రక్షణ అని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల అన్నారు. హెల్మెట్ ధారణ అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం టెక్కలి కోర్టు నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనంపై వెళ్లే ప్రతిఒక్కరూ హెల్మెట్‌ను విధిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద, ఎస్‌ఐ టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పథకాల అమల్లో స్పష్టత కరువు



నర్తు రామారావు, ఎమ్మెల్సీ

కంచిలి: సంక్షేమ పథకాల అమల్లో ప్రస్తుత ప్రభుత్వంలో స్పష్టత కరువైందని ఎమ్మెల్సీ నర్తు రామారావు మంగళవారం పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కేవలం సామాజిక పింఛన్ల పెంపు మాత్రమే చేపట్టారని, సూపర్ సిక్స్ హామీల్లో మిగతా వాటి అమలు సంగతేంటని ప్రశ్నించారు. పథకాల అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేనట్లు కన్పిస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో మిగతావి కూడా త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కిడ్నీ బాధితుడికి ఎస్‌జీఎఫ్ సాయం



సాయమందిస్తున్న ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు

కవిటి: మండలంలోని మాణిక్యపురం గ్రామ సచివాలయానికి చెందిన గ్రామ వలంటీర్ దొళాయి దిలీప్ కొంతకాలంలో కిడ్నీవ్యాధులతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ సంస్థ తమ వంతుగా మంగళవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి రూ.8000 ఆర్థిక సాయాన్ని అందించారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసేందుకు కిడ్నీ ఇచ్చేందుకు తల్లి ముందుకొచ్చినా వైద్యఖర్చులు రూ.10లక్షలు వరకు అవసరమని వైద్యులు తెలపడంతో బాధిత కుటుంబ సభ్యులు దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

జగన్నాథుని ఆలయానికి విరాళం



ఆర్థిక సాయమందిస్తున్న దాతలు, రిటైర్డ్ డీఎస్పీ

కవిటి : ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం కవిటిలో వెలసిన జగన్నాథ ఆలయ పునర్నిర్మాణానికి దాతలు రూ.35,000 విరాళాల్ని అందించడం అభినందనీయమని జగన్నాథ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నారు. మంగళవారం రిటైర్డ్ డీఎస్పీ ఎస్‌వీవీప్రసాదరావు సమక్షంలో జగతి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ లమ్మత శేషశయనం రూ.25000, మదనాపురం మాజీ సర్పంచ్ మార్పు వెంకటేశం రూ.10,000 చొప్పున విరాళాల్ని కమిటీ పెద్దలకు అందించారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణానికి నిధులు అవసరం ఉన్న నేపథ్యంలో రిటైర్డ్ డీఎస్పీ తనవంతుగా కొంతమొత్తాన్ని, తన స్నేహితుల ద్వారా మరికొంత మొత్తాన్ని అందించడంలో ప్రసాదరావు కృషిని కమిటీ సభ్యులు కొనియాడారు.

రాయితీపై పశువుల షెడ్ల నిర్మాణం

వజ్రపుకొత్తూరు రూరల్: పాడి రైతులకు అందిస్తున్న రాయితీపై పశువుల షెడ్ల నిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి మెట్ట పాపారావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ పశుపెంపకదారులకు 90 శాతం రాయితీపై పశువులషెడ్లు, 70 శాతం రాయితీపై గొర్రెలు, మేకలు, కోళ్ల షెల్టర్ల నిర్మాణం కోసం ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. పశువుల షెడ్‌కు గరిష్ఠంగా రూ.2.30 లక్షలు, కోళ్ల పెంపకం షెడ్‌కు గరిష్ఠంగా రూ.1,32,000లు వరకు రాయితీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

కళాశాలలో సమస్యల కొలువు

- అసౌకర్యాలకు నిలయంగా కంచిలి ప్రభుత్వ జూనియర్ కాలేజీ
- నిర్మాణానికి నోచుకోని అదనపు తరగతి గదులు
- అధ్యాపకుల కొరతతో విద్యార్థుల ఇబ్బందులు



కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు తిష్టవేశాయి. అరకొర తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ సదుపాయం లేకపోవడం, సబ్జెక్టు అధ్యాపకుల కొరత ఇక్కడ వేధిస్తున్నాయి. ఇటీవల పిడుగుపాటుకు కళాశాలలో కంప్యూటర్లు, విద్యుత్ పరికరాలు పాడయ్యాయి. కంచిలితోపాటు మండల వ్యాప్తంగా ఉన్న పది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత చెందిన వారు, పక్కనే ఉన్న కవిటి మండలం నుంచి పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు వచ్చి చదువుతున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో 250 మంది విద్యార్థులు ఇక్కడ విద్య అభ్యసిస్తున్నారు. ఇటీవలకాలంలో మరికొందరు చేరారు. తరగతి గదులు కొరతగా ఉండటంతో పాటు ముఖ్యమైన ల్యాబ్ సౌకర్యం లేదు. దీంతో సైన్స్ ప్రయోగాలు చేసేటప్పుడు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

చాలని గదులు..

కళాశాలలో నాలుగు గ్రూప్‌లలో తెలుగు, ఇంగ్లీష్, ఒడియా మీడియం విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం తరగతి గదులే ఉండటంతో వసతి సమస్య వేధిస్తోంది. ఒక గదిని ప్రిన్సిపాల్ చాంబర్‌తోపాటు స్టాఫ్ రూమ్‌కు కేటాయించారు. ఇంకో గదిని గ్రంథాలయానికి ఉపయోగిస్తున్నారు. మిగిలిన ఆరు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక్కో గదిలో 50 నుంచి 60 మంది వరకు విద్యార్థులు కిక్కిరిసి కూర్చుంటున్నారు. ప్రత్యేకంగా మెస్ షెడ్ అనేది కూడా లేకపోవడంతో మధ్యాహ్న భోజనాలు చేసేటప్పుడు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరవ్వగా, ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పునాదుల దశలోనే నిర్మాణాలను ఆపేశారు. కొన్నేళ్లుగా ఈ నిర్మాణాలు ముందుకు సాగలేదు. ఈ గదుల నిర్మాణం పూర్తయితే వసతి సమస్య పరిష్కారమవుతుంది.



పునాదుల దశలోనే నిలిచిపోయిన అదనపు గదుల నిర్మాణం

ప్రహరీ లేక ఇక్కట్లు..

జాతీయ రహదారికి వెళ్లేందుకు స్థానికులు ఈ కళాశాల మధ్య నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. తరగతులు నిర్వహించిన సమయంలో వాహనాలు రాకపోకలు శబ్దాలతో తరగతుల బోధన సమయంలో అధ్యాపకులు, విద్యార్థులు ఏకాగ్రత కోల్పోతున్నారు. ప్రహరీ లేకపోవడంతో పశువులు సైతం కళాశాల ప్రాంగణంలోకి వచ్చేస్తున్నాయి. రాత్రిపూట బయటి వ్యక్తులు కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశిస్తున్నారు. తరగతుల నిర్వహణకు 15 మంది అధ్యాపకులు అన్ని సబ్జెక్టులకు అవసరం కాగా, కేవలం ఇద్దరు అధ్యాపకులు మాత్రమే రెగ్యులర్ విధులు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు, గెస్ట్ ఫ్యాకల్టీపైనే తరగతుల బోధన ఆధారపడి ఉంది.

వసతి సమస్యతో సతమతం..



ఇక్కడి కళాశాలలో తరగతి గదుల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఒక్కో తరగతి గదిలో 50 నుంచి 60 మంది వరకు కూర్చొంటున్నాం. దీని వలన ఎక్కువ శాతం ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నాం. ఒకే తరగతిలో ఎక్కువ మంది కూర్చోవడం వలన ఏకాగ్రత కూడా ఉండటం లేదు. అదనపు తరగతి గదులు నిర్మాణం చేపట్టాలి.

– సంతును గౌడో, ఎంపీసీ సెకెండియర్

సౌకర్యాలు మెరుగుపర్చాలి..



కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సౌకర్యాలు మెరుగుపర్చాలి. ప్రస్తుతం కిక్కిరిసిన తరగతి గదుల్లో బోధన జరుగుతోంది. నిర్మాణం ఆపేసిన అదనపు గదుల్ని పూర్తిచేయాలి. మధ్యాహ్న భోజనం చేయడానికి ప్రత్యేక షెడ్డు నిర్మించాలి. బోధన చక్కగా ఉన్నా సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నాం.

–మన్మథ ప్రధాన్, ఎంపీసీ సెకెండియర్

అధికారులు ప్రొటోకాల్ పాటించరా?

- మండల సర్వసభ్య సమావేశంలో నిలదీసిన ప్రజాప్రతినిధులు



అధికారులను నిలదీస్తున్న ఎంపీపీ సరోజనమ్మ, సభ్యులు

టెక్కలి : ప్రభుత్వం ఏదైనప్పటికీ ప్రజాప్రతినిధులను గౌరవించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పలువురు నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం టెక్కలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అట్ల సరోజనమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో విత్తనాలు, పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులకు కనీసం సమాచారం ఇవ్వకపోవడంపై మండిపడ్డారు. ఎటువంటి అర్హత లేనివారితో పంపిణీ చేయించడం తగదన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరికీ సమాచారం అందజేసి కార్యక్రమాలు నిర్వహించేవారమని గుర్తు చేశారు. డయేరియా, మలేరియా విస్తరిస్తున్న నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సభ్యులు కోరారు. సమావేశంలో చర్చించిన సమస్యలను నమోదు చేయడానికి ప్రత్యేకంగా అధికారిని ఏర్పాటు చేసి సభ అనంతరం ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించేలా చూడాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ కె.విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ పి.రమేష్, సూపరింటెండెంట్ హెచ్.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమల్లో వివక్ష చూపిస్తే సహించేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ నిమ్మన దాస్

సోంపేట:ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలని, ఈ విషయంలో అన్యాయం చేస్తే సహించేది లేదని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. సోంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.రామారావు ఆధ్వర్యంలో ఎంపీపీ నిమ్మన దాస్ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి మాట్లాడుతూ జూలైలో తక్కువ వర్షపాతం కురవడంతో వరినారు పూర్తిగా మొలవలేదన్నారు. మండలంలో 247 మంది కౌలు రైతులను గుర్తించి సాగుదారు పత్రాలు అందజేసినట్లు చెప్పారు. పంచాయతీరాజ్ ఏఈ రమేష్ మాట్లాడుతూ పూర్తయిన సచివాలయాల భవనాల నిర్మాణాలకు త్వరలో బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఇరిగేషన్ ఏఈ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఉపాధి ద్వారా కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేశామన్నారు. కొర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సౌజన్య మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వైఎస్సార్ చేయూత పథకం నిధులు అందరికీ జమచేసేలా చర్యలు తీసుకోవాలని గొల్లూరు సర్పంచ్ పిన్నింటి ఈశ్వరావు, పాలవలస సర్పంచ్ మర్ల హేమలత తదితరులు కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీలో ఎవరైనా కక్షసాధింపు చర్యలకు దిగితే అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ప్రొటోకాల్ ప్రకారం గ్రామస్థాయిలోని ప్రజా ప్రతినిధులకు అధికారులు సమాచారం అందజేయాలన్నారు. అధికార పార్టీనాయకులు చెప్పారని విధులను అతిక్రమిస్తే కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గురాల శ్రీను, కర్తలిపాలెం ఎంపీటీసీ మంగి గణపతి, కో–ఆప్షన్ సభ్యులు ఐ.లక్ష్మినారాయణ, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులతో రూరల్ ఎస్సై లక్ష్మణరావు

ఇచ్ఛాపురం: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని రూరల్ ఎస్సై ఎస్.లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాల ఆవరణలో పెట్టుబడుల వేడుక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, నైతిక విలువలను కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎం.ఎస్.మణి, నార్త్‌జోనల్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కర్కాటక సంక్రమణ పూజలు



అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: కర్కాటక సంక్రమాణం సందర్భంగా మంగళవారం మండలంలో వివిధ గ్రామ దేవతల ఆలయాలు, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు, హోమాలు జరిపించారు.

వలంటీర్ల వేతనాలు విడుదల చేయాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు

కంచిలి: మండలంలో వివిధ సచివాలయాల పరిధిలో సచివాలయ వలంటీర్ల గౌరవ వేతనం మూడు నెలలుగా చెల్లించడం లేదని పలువురు వాపోయారు. ఈ మేరకు ఎంపీడీఓ వి.నీరజకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మిగతా మండలాల మాదిరిగా తమకు కూడా నెలవారీ గౌరవ వేతనాలను విడుదల చేయాలని కోరారు.

సరుకులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



కందిపప్పు పంపిణీ చేస్తున్న అధికారులు

కోటబొమ్మాళి: కిరాణా వర్తకులు నిత్యావసర సరుకులను ప్రభుత్వం నిర్ణయించిన రేట్లు కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని పౌర సరఫరాల డీటీ కె.రాము హెచ్చరించారు. మంగళవారం కోటబొమ్మాళిలోని పలు కిరాణా షాపులను తనిఖీ చేశారు. అమ్మకాల ధరలను పరిశీలించి, షాపులకు నిత్యావసర సరుకుల ధరల పట్టికలను అతికించారు. కేజీ కందిపప్పు రూ.160కు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ పేడాడ అఖిల్ పాల్గొన్నారు.

నేడు తొలి ఏకాదశి పూజలు

కంచిలి: మండల కేంద్రంలోని కంచమ్మతల్లి ఆలయం ఆవరణలో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం అభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి కల్యాణం, సాయంత్రం 4 గంటల నుంచి ఊరేగింపు, రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ, మంగళహారతి తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వరి నారుమడుల పరిశీలన



పలాసపురంలో నారుమడులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సోంపేట: మండలంలోని పలాసపురంలోని వరి నారుమడులను సహాయ వ్యవసాయ సంచాలకులు కె.జగన్మోహనరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి మంగళవారం పరిశీలించారు. జూలైలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మెరక ప్రాంతాలైన పలాసపురం, బెంకిలి, జింకిభద్ర, గొల్లూరు, మామిడిపల్లి తదితర గ్రామాల్లో నారు మొలక శాతం తక్కువ వచ్చినట్లు గుర్తించారు. ఈ నెల 20 వరకు వర్షాలు పడకపోతే నారు చాలకపోయే అవకాశం ఉందన్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయ విత్తనాల సరఫరాకు అంచనాలు రూపొందిస్తామన్నారు. వ్యవసాయ సహాయకులు మూడు రోజుల్లోగా వివరాలు సేకరించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

నేడు వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం

టెక్కలి: స్థానిక పాత జాతీయ రహదారిలోని వేంకటేశ్వర ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినం పురష్కరించుకుని స్వామివారి వార్షిక కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ మొదలుకొని ప్రత్యేక పూజలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, మహాన్నదానం, సాయంత్రం 5 గంటలకు శ్రీనివాస కల్యాణం, రాత్రి 7 గంటల నుంచి తిరువీధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే స్థానిక పట్టు మహాదేవి కోనేరు గట్టుపై వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు పంచామృత అభిషేకాలు, సాయంత్రం 6 గంటలకు ఉంజల్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

స్వేచ్ఛావతి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంట్ను అమ్మవారు

ఇచ్ఛాపురం: గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారికి మంగళవారం కర్కాటక సంక్రమణం సందర్భంగా తైలమర్ధనం, కుంకుమపూజ, పంచామృతాలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు అన్న ప్రసాదం అందించారు.

రంగనాథునిగా జగన్నాథుడు



పూజలందుకుంటున్న జగన్నాథుడు

సోంపేట: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా సోంపేటలోని జగన్నాథ స్వామి ఆలయంలో జగన్నాథుడు మంగళవారం భక్తులకు రంగనాథుని అవతారంలో దర్శనమిచ్చారు. అర్చకులు యతిరాజు స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

విత్తన బంతుల తయారీపై శిక్షణ



శిక్షణ నిర్వహిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: రవిశంకర్ గురూజీ ఆదేశాల మేరకు జూన్ 5 నుంచి ఆగస్టు 19 వరకు మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి డాక్టర్ కె.అమ్మన్నాయుడు తెలిపారు. నగరంలోని బ్యాంకర్స్ కాలనీలోని విశాఖ స్కూల్లో మంగళవారం విద్యార్థులకు సీడ్‌బాల్స్(విత్తన బంతులు) తయారీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని గురూజీ ఇచ్చిన పిలుపు మేరకు పర్యావరణ సమతుల్యత, మొక్కల పెంపకం, పచ్చదనం ప్రాముఖ్యతపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి దార్లపూడి రవి మాట్లాడుతూ మొక్కల పెంచడానికి అవసరమైన సీడ్ బాల్స్‌ను ఎలా తయారు చేయాలనే అంశంపై ఈ నెలాఖరులోగా 20 పాఠశాలలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 200మంది విద్యార్థులతో 800 విత్తన బంతులు తయారు చేసినట్లు వివరించారు. వీటిని డ్రోన్స్ ద్వారా గాని, ఇండియన్ నేవీ ద్వారా గానీ వర్షపాతం తక్కువగా ఉన్న మండలాలు, కొండ ప్రాంతాల్లో వెదజల్లుతామని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ అధినేత తమ్మినేని మధుసూదనరావు, ప్రధానోపాధ్యాయులు రామారావు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యులు బెవర రవిశంకర్, టీచర్లు వారణాసి సందీప్, దేసూళ సురేంద్ర, వలంటీర్ పి.శ్రీనివాస్, సీటీసీ మెంబర్ అన్నపూర్ణ, అను తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పండ్లు పంపిణీ



పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న బీసీ సంఘ నాయకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న బెహరా మనోవికాస కేంద్రంలో మంగళవారం దివ్యాంగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ సంఘ జిల్లా అధ్యక్షుడు పైడి చంద్రరావు, ఉత్తరాంధ్ర గౌరవ అధ్యక్షుడు కొమ్ము రమణమూర్తి, జనరల్ సెక్రటరీ తోనంగి వెంకన్న యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి, రత్నాల మురళీమోహన్, వైస్ ప్రెసిడెంట్ మైలపిల్లి నరసింహమూర్తి, కుప్పిలి నరసింహమూర్తి, ప్రఫుల్లకుమార్, రాజేష్ పాల్గొన్నారు.

జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

రణస్థలం: జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంగళవారం సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించిన ఆయన కేసుల వివరాలు అడిగి కేసులు తెలుసుకున్నారు. సమస్యాత్మక గ్రామాలపై ఆరా తీశారు. ఇసుక, గంజాయి ప్రభావం మండలంపై ఎంత వరకు ఉంటుందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మత్స్యకార గ్రామాలతో పాటు మండల వ్యాప్తంగా శాంతి భద్రతలపై పర్యవేక్షణ పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు.

విద్యార్థులకు అభినందన

రణస్థలం: ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో అధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం సంతోషదాయకమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. బంటుపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన అదర్శ పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యేను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండములగాం అదర్శ పాఠశాల నుంచే 20 మంది ట్రిపుల్ ఐటీకి కావడం అభినందనీయమన్నారు. చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ ఉన్నారు.

డోకులపాడులో పారిశుద్ధ్య పనులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని డోకులపాడులో సర్పంచ్ వడ్డి సరిత, ఎంపీటీసీ సభ్యురాలు వడ్డి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది సోమ, మంగళవారాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. మత్స్యకార సొసైటీ అధ్యక్షులు ఎం.పాపారావు, ఢిల్లేశ్వరరావు పర్యవేక్షించారు.